క్లుప్తంగా

ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్ శిక్షణ



శిక్షణ ఇస్తున్న రిసోర్స్ పర్సన్లు

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో దండేపల్లి, లక్సెట్టిపేట, జన్నారం మండలాల ఉపాధ్యాయులకు శుక్రవారం డిజిటల్ లెర్నింగ్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇంగ్లిష్, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులకు డిజిటల్ లెర్నింగ్‌పై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు నేర్పించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో శైలజ, కోర్సు డైరెక్టర్ వామనమూర్తి, రిసోర్స్‌పర్సన్ షారిక్, రాజన్న, ఎమ్మార్పీలు పాల్గొన్నారు.

జీఎం హెచ్‌ఆర్‌కు సన్మానం

శ్రీరాంపూర్: సింగరేణి మానవ వనరుల(హెచ్ఆర్) జీఎం వెంకటరమణారెడ్డిని ఏరియా అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ నెల 31తో ఆయన రిటైర్మెంట్ కాబోతున్న సందర్భంగా శుక్రవారం శ్రీరాంపూర్‌కు వచ్చిన ఆయన్ను తన చాంబర్‌లో ఏరియా జీఎం ఎం.శ్రీనివాస్ శాలువాతో సత్కరించారు. కంపెనీలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌వోటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్సా, ఏరియా ఇంజనీర్ రమణారావు, డీజీఎం(పర్సనల్) అనిల్‌కుమార్, ఎస్టేట్స్ అధికారి వరలక్ష్మి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్ రెడ్డి, ఎన్విరాన్మెంట్ అధికారి హనుమాన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

శ్రీరాంపూర్: నస్పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు సిబ్బందికి, మున్సిపాలిటీ సిబ్బందికి అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యులు వెంకటేశ్ ఆధ్వర్యంలో సిబ్బంది గుండె జబ్బు వచ్చినప్పుడు, శ్వాస ఆగిపోతున్న సమయంలో ఎలా సీపీఆర్ చేయాలో చేసి వివరించారు. ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది నామ్‌దేవ్, 108 సిబ్బంది బీ. సంపత్, బీ. లక్ష్మణ్, ఏ. దేవయ్య, టీ. అరవింద్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర 33కేవీ లైన్, సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించేందుకు గాను శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ కొట్టి శ్రీనివాస్ తెలిపారు. కొమ్మెర ఫీడర్ పరిధిలోని కొమ్మెర, ఆస్నాద, పొక్కూరు గ్రామాల సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 9గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చెన్నూర్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ దేవేందర్‌రావు అన్నారు. స్థానిక ఆర్టీసీ ఎదుట వాహనాల తనిఖీ నిర్వహించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని, మద్యం సేవించి వాహనాలు నడపొద్దని, ప్రతీ వాహనదారుడు వెంట వాహన పత్రాలను ఉంచుకోవాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎస్సార్ త్వరగా కోలుకోవాలని పూజలు

దండేపల్లి: మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అనారోగ్యానికి గురికావడంతో, ఆయన త్వరగా కోలుకోవాలని మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే గోత్రనామాలతో అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జాబ్‌మేళా సద్వినియోగం చేసుకోవాలి

పాతమంచిర్యాల: నిరుద్యోగ యువత ప్రభుత్వం నిర్వహించే జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని సీవీ రామన్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెరినా పెయింట్స్ సంస్థ 2190ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించగా 393మంది నిరుద్యోగులు హాజరయ్యారు. 119మందిని ఉద్యోగాల కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య, మెరినా పెయింట్స్ ప్రతినిధులు నివేదిత, రిషీకా, కోటేష్, యంగ్ ప్రొఫెషనల్స్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తగ్గుతున్న ఆదరణ



తారి(మిషన్)పై ప్రమిదల తయారీ



సుబ్బారాంపల్లిలో సారెపై ప్రమిదలు తయారు చేస్తున్న కుమ్మరి



తయారు చేసిన ప్రమిదలు

చెన్నూర్‌రూరల్: ఒకప్పుడు కుమ్మరోళ్లు తయారు చేసిన ప్రమిదలకు దీపావళి పండుగ సమయంలో ఎంతో ఆదరణ ఉండేది. కానీ ప్రస్తుతం వారి కళలకు ఆదరణ తగ్గిపోయింది. ప్రభుత్వం నుంచి వారికి ఎలాంటి సాయం అందడం లేదు. సంఘం నుంచి మాత్రం (తారి) మిషన్లు కొందరికి అందజేశారు. మరికొందరి దగ్గర ఉన్న మిషన్లు పనికిరాకుండా మూలనపడ్డాయి. ప్రభుత్వం తమను ఆదరించి ఆదుకోవాలని కుమ్మరులు కోరుతున్నారు.

బైపాస్ రోడ్డు అధ్వానం



చెన్నూర్ పెద్ద చెరువు సమీపంలో...

చెన్నూర్: చెన్నూర్ బైపాస్ రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు విపరీతంగా పెరగడంతో అడవిని తలపిస్తోంది. చెత్తా చెదారం విచ్చలవిడిగా వేయడంతో రోడ్డుకి ఇరువైపులా డంపింగ్ యార్డును తలపిస్తోంది. ముళ్లపొదలు, చెత్త కుప్పలతో అధ్వానంగా మారినా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.14కోట్ల నిధులు మంజూరు చేయగా, పనులు కొత్తగూడెం కాలనీ వరకు పూర్తికాగా, గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం పూర్తి చేసి, రోడ్డుకిరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సుప్రీంకోర్టు జడ్జిపై దాడిని ఖండించాలి



మందమర్రిరూరల్: తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్ జ్యోత్స్నకు వినతిపత్రం ఇస్తూ...

నెన్నెల/చెన్నూర్/భీమారం/దండేపల్లి/మందమర్రిరూరల్/భీమిని/తాండూర్/మంచిర్యాలరూరల్ (హాజీపూర్): సుప్రీంకోర్టు జడ్జిపై చేసిన దాడిని దేశం మొత్తం ఖండించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశానుసారం శుక్రవారం తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. నెన్నెలలో నాతరి శివకృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు, చెన్నూర్‌లో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సీహెచ్ మల్లేశ్ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్ సనత్‌కుమార్‌కు, తాండూర్‌లో మండల ఇన్‌చార్జి అయిళ్ల గణేశ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ జ్యోత్స్నకు, భీమారంలో తహసీల్దార్ సదానందంకు, దండేపల్లిలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేకు, మందమర్రిలో తహసీల్దార్ సతీష్‌కు, కన్నెపల్లిలో తహసీల్దార్ రాంచందర్‌కు ఎమ్మార్పీఎస్ నాయకులు వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి చేయడానికి సనాతనం అనడం దివాల్ కోరు రాజకీయమని అన్నారు. దాడికి సిద్ధపడిన నిందితుడిని నాన్‌బెయిలబుల్ సెక్షన్ కింద అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మం పేరిట హింసను ప్రోత్సహిస్తే ధర్మం కూడా ఒప్పుకోదన్నారు. ధర్మం పేరిట దాడులు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా ప్రభుత్వం కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు.

‘సాక్షి’పై కక్ష సాధింపు సరికాదు

- ఏపీ ప్రభుత్వ తీరును ఖండిస్తూ జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- రాస్తారోకోలు, అధికారులకు వినతిపత్రాలిచ్చిన పాత్రికేయులు



దండేపల్లి: తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తూ...



లక్సెట్టిపేట: వినతిపత్రం ఇస్తున్న పాత్రికేయులు



జన్నారం: రాస్తారోకో చేస్తున్న జర్నలిస్టులు

జన్నారం: ఉద్దేశపూర్వకంగా ‘సాక్షి’ దినపత్రిక ఎడిటర్‌పై అక్రమ కేసులు పెట్టి, వేధింపులకు గురిచేయడం సరికాదని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చిలువేరు నర్సయ్య పేర్కొన్నారు. ‘సాక్షి’ దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై ఆంధ్రప్రదేశ్ పోలీసుల అక్రమ కేసులు, వేధింపులకు నిరసనగా శుక్రవారం జన్నారం మండల కేంద్రంలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అక్కడి ప్రభుత్వ ఆదేశాల మేరకు పోలీసులు విచారణ పేరుతో వేధింపులకు గురి చేయడం పత్రిక స్వేచ్ఛను హరించినట్లేనన్నారు. కేసులు ఉపసంహరించుకోకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామన్నారు. ప్రెస్‌క్లబ్ ప్రధాన కార్యదర్శి లింగన్న, గౌరవ అధ్యక్షుడు కాంత య్య, సభ్యులు రమేశ్, మురళి, వేణుగోపాల్, నర్సయ్య, ముస్తఫా, సత్యం, వెంకటఫణిరాజు, శివరామకృష్ణ, సతీశ్ గౌడ్, సతీశ్, రాజు, మల్లేశ్ పాల్గొన్నారు.

దండేపల్లిలో తహసీల్దార్‌కు వినతి

దండేపల్లి: ‘సాక్షి’ దినపత్రికపై ఏపీలో అక్కడి ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు సరికాదని దండేపల్లి ప్రెస్‌క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండి రవి గౌడ్, ఎడ్ల రాజన్న పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వ తీరును నిరసిస్తూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండేకు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నకిలీ మద్యం వార్తలు ప్రచురించినందుకు పత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డికి పదేపదే నోటీసులు జారీ చేస్తూ, ఇబ్బందులకు గురిచేయడాన్ని ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. క్లబ్ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్, సభ్యులు వెంకటపతి, కుమారస్వామి, వెంకటేశ్, సుభాష్, చందు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేటలో...

లక్సెట్టిపేట: ఆంధ్రప్రదేశ్ ‘సాక్షి’ దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డిపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని మండలంలోని పాత్రికేయులు శుక్రవారం స్థానిక తహశీల్దార్ దిలీప్‌కుమార్‌కు మెమోరాండం అందజేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్న పత్రిక ఎడిటర్, కార్యాలయంపై దాడి చేయడం దారుణమన్నారు. పత్రిక స్వేచ్ఛను కాపాడాల్సిన ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడటం సరికాదన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన మెమోరాండం తహసీల్దార్‌కు అందజేశారు. పత్రిక విలేకరులు పాల్గొన్నారు.

సృజనాత్మకత వెలికి తీసేందుకే సైన్స్ ఫెయిర్

- డీఈవో యాదయ్య..



విద్యార్థుల సైన్స్ ప్రదర్శనను తిలకిస్తున్న డీఈవో

దండేపల్లి: సైన్స్ ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయొచ్చని డీఈవో యాదయ్య అన్నారు. దండేపల్లి మండలం గుడిరేవు ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రదర్శనలు తిలకించి అభినందించారు. సైన్స్ పాఠాలు ప్రయోగాల ద్వారా బోధిస్తే విద్యార్థులకు సులభంగా అర్థం కావడంతో పాటు గుర్తుండి పోతాయన్నారు. ఎంఈవో మంత్రి రాజు, రూమ్‌టూ రీడ్ జిల్లా కోఆర్డినేటర్ మధు, హెచ్‌ఎం బుచ్చన్న, సీఆర్పీ సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

బార్ షాపులు, హోటళ్లలో తనిఖీలు

- రూ.10వేలు జరిమానా



జరిమానా రశీదును అందిస్తున్న కమిషనర్

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని బార్ అండ్ రెస్టారెంట్, హోటళ్లలో శుక్రవారం మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేశ్ ఆకస్మిక తనిఖీలు చేశారు. అతిథి రెస్టారెంట్, శ్రావణ్ రెస్టారెంట్, రాయల్ బార్ అండ్ రెస్టారెంట్‌లలో తనిఖీలు చేయగా కల్తీ, అపరిశుభ్రత కలిగిన ఆహార పదార్థాలు బయటపడ్డాయి. చికెన్ ఇతర పదార్థాలు నాణ్యత లేకుండా అపరిశుభ్రంగా ఉన్నట్లు గుర్తించి అతిథి రెస్టారెంట్‌కు రూ.4వేలు, శ్రావణ్ గ్రాండ్ రెస్టారెంట్‌కు రూ.3వేలు, రాయల్‌బార్ అండ్ రెస్టారెంట్‌కు రూ.3వేలు చొప్పున జరిమానా విధించి వసూలు చేశారు. ఈ మేరకు సదరు యజమానులకు రశీదు అందజేశారు. ప్రజారోగ్యాన్నీ దృష్టిలో పెట్టుకుని హోటల్, బార్‌అండ్ రెస్టారెంట్ నిర్వాహకులు నాణ్యత కలిగిన, శుభ్రమైన ఆహారం అందించాలని కమిషనర్ సూచించారు. నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కార్మిక సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న జీఎం రాధాకృష్ణ

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని గనుల, డిపార్ట్‌మెంట్‌ల కార్మికుల సంక్షేమ కార్యక్రమాలపై ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం సంక్షేమాధికారులతో జీఎం రాధాకృష్ణ సమీక్ష నిర్వహించారు. ఏరియాలోని కార్మికుల గైర్హాజర్ శాతం, హెల్త్ కార్డుల వివరాలు తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్మికుల సంక్షేమం విషయంలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని తెలిపారు. సమావేశంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్, ఐఈడీ కిరణ్‌కుమార్, పర్సనల్ ఆఫీసర్ కార్తీక్, ఏరియాలోని సంక్షేమాధికారులు ఉన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలి



ధర్మారంలో టీకా వేస్తున్న పశువైద్యాధికారి రాకేష్‌శర్మ

భీమారం/కాసిపేట/లక్సెట్టిపేట: పశువులకు విధిగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని భీమారం మండల పశువైద్యాధికారి రాకేష్ శర్మ, కాసిపేట మండల పశువైద్యాధికారి సరిత, లక్సెట్టిపేట వైద్యాధికారి యాకొబురెడ్డి రైతులను కోరారు. భీమారం మండలంలోని ధర్మారంలో, కాసిపేట మండలంలోని ధర్మరావుపేటలో, లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో శుక్రవారం పశువైద్యశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. టీకాలు వేసే కార్యక్రమం నవంబర్ 14వరకు కొనసాగుతుందని తెలిపారు.

కౌలు రైతు పంట ధ్వంసం



ధ్వంసమైన పంట

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ర్యాలీ గ్రామ శివారులో బుద్దె రాజేశ్వరి-రాజయ్య దంపతులు 4ఎకరాల పత్తి చేను, 5ఎకరాల వరి పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్నారు. కష్టపడి కౌలు చేసుకుంటున్న పత్తి చేను, వరి పొలాన్ని శుక్రవారం కొంతమంది ట్రాక్టర్‌తో నాశనం చేయడంతో పాటు పొలంలోకి పశువులను వదిలిపెట్టారు. అలాగే పొలంలో ఏర్పాటు చేసుకున్న సోలార్ బ్యాటరీని సైతం దొంగిలించారు. ఈ విషయమై తమకు ఓ మహిళా కానిస్టేబుల్‌పై అనుమానం ఉందని, ఈ మేరకు తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

బీసీ బంద్ విజయవంతం చేయాలి



శ్రీరాంపూర్: మద్దతు ప్రకటిస్తున్న ట్రస్మా నాయకులు

శ్రీరాంపూర్/దండేపల్లి/పాతమంచిర్యాల: ఈ నెల 18న తలపెట్టిన బీసీ బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల నాయకులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో బీసీ జేఏసీ, బీసీ సమాజ్, బీసీ సంక్షేమ సంఘం, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్, సీపీఐ పార్టీ నాయకులు, గంగపుత్ర సంఘం, జనసేనా పార్టీ, దండేపల్లిలో మున్నూరుకాపు సంఘం, కాంగ్రెస్ నాయకులు, శ్రీరాంపూర్‌లో తెలంగాణ ప్రైవేట్ పాఠశాలల సంఘం (ట్రస్మా) నాయకులు, బీఆర్‌ఎస్ నేతలు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ రాష్ట్ర బంద్‌కు తాము మద్దతునిస్తూ బంద్‌లో పాల్గొంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్త బంద్‌లో భాగంగా అత్యవసర సేవలు మినహా జిల్లాలోని వ్యాపార వర్గాలు, పెట్రోల్ బంక్‌లు, కూరగా యల మార్కెట్ వ్యాపారులు బంద్‌లో పాల్గొ ని బీసీ ప్రజల ఆకాంక్షను చాటాలన్నారు. ఆయా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

108లో ప్రసవం

చెన్నూర్‌రూరల్: కోటపల్లి మండలం ఎడగట్ట గ్రామానికి చెందిన గొలుసుల భారతి అనే గర్భిణీకి పురిటినొప్పులు రావడంతో ఆమె భర్త గణేశ్ 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది ఐత సంపత్‌రెడ్డి, ఈఎంటీ పోలవు పోచన్న ఆ గ్రామానికి వెళ్లి చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి ఆమెను తీసుకొస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో 108 సిబ్బంది చెన్నూర్ మండలం శివలింగాపూర్ వద్ద వైద్యుల సూచనలతో సుఖ ప్రసవం చేశారు. భారతి మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ తెలిపారు. మెరుగైన వైద్య సేవల కోసం చెన్నూర్ సివిల్ ఆసుపత్రికి తరలించారు.

ప్రధానోపాధ్యాయుడికి అరుదైన గౌరవం



ఎడ్లబండిపై ఊరేగిస్తున్న ఉపాధ్యాయులు

జన్నారం: మండలంలోని తపాలపూర్ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేసి రిటైర్డ్ అయిన లగిశెట్టి మురళీధర్ దంపతులకు అరుదైన గౌరవం లభించింది. గ్రామంలోని శివాలయం గుడి నుంచి ఎడ్లబండిపై మురళీధర్ దంపతులను విద్యార్థులు, ఉపాధ్యాయులు బండిని లాగుతూ.. పాఠశాల వరకు తోలుకొచ్చారు. ఊరేగిస్తుండగా దారిలో గ్రామప్రజలు పూలు చల్లుతూ అభివాదం చేశారు. పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు జ్ఞాపికాలు అందజేసి ఆయనతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. మండల విద్యాధికారి విజయకుమార్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి, ప్రధాన కార్యదర్శి నగురు సత్యనారాయణ, రాష్ట్ర నాయకులు పిట్టల రాజారావు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల తనిఖీ



తనిఖీ చేస్తున్న తహసీల్దార్

జన్నారం: మండల కేంద్రంలోని పొనకల్ జీసీసీ రేషన్ షాపును శుక్రవారం తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న లబ్ధిదారులతో మాట్లాడి, రేషన్ సరిగ్గా ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం షాపులోని సరుకులు, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. రేషన్ కార్డుల ప్రకారం అందరికి బియ్యం అందించాలని సూచించారు.

కుమురం భీం వర్ధంతి



నివాళులర్పిస్తున్న ఆదివాసీలు

కాసిపేట: మండలంలోని సాలెగూడలో శుక్రవారం ఆదివాసీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివాసీ అమరుడు కుమురం భీం వర్ధంతిని పురస్కరించుకొని భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ యూత్ కమిటీ అధ్యక్షుడు సిడం గణపతి, ప్రధాన కార్యదర్శి పెందూర్ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు ఉయిక మోతీరాం, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లుల కోసం ధర్నా



భీమారం: వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

బెల్లంపల్లి/భీమారం: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్, సీఐటీయూ బెల్లంపల్లి మండల కార్యదర్శి సీ.హెచ్.దేవదాస్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం బెల్లంపల్లి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయం ఎదుట, భీమారంలో ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని వండిపెడుతున్న కార్మికులకు సక్రమంగా వేతనాలు, బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు. తీవ్ర కాలయాపన చేస్తుండటంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బిల్లులు, వేతనాలు చెల్లించి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమాల్లో మధ్యాహ్న భోజన కార్మికులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

టీఎన్జీవో నాయకులకు సన్మానం

పాతమంచిర్యాల: నీటి పారుదల శాఖ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించినందుకుగాను శుక్రవారం జిల్లా కేంద్రంలో జిల్లా టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు శ్రీహరిని, జిల్లా మాజీ అధ్యక్షుడు సురేష్, టీఎన్జీవో కేంద్ర సంఘం కార్యదర్శి గోపాల్‌ను నీటి పారుదల శాఖ ఉద్యోగులు రోషయ్య, సంపత్, సారికలు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

యోగా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

దండేపల్లి: జన్నారం మండలం ఇందన్‌పల్లిలో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో దండేపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు రాజమణి, విజయ్, శ్రీనాథ్ అత్యంత ప్రతిభ కనబర్చారని పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వర్‌రావు, పీడీ రవి తెలిపారు. వారు జోనల్ స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు.